

మాస్టారు కాదండోయ్..

ఈయనెవరో గుర్తుపట్టారా.. ఎవరా అని తలలుపట్టుకుంటున్నారా..మన మాస్టార్లు గుర్తుపడతారు కానీ.. సాధారణ ప్రజానీకానికి తెలియదు..ఎందుకంటే ఆయన మన జిల్లా విద్యాశాఖాధికారి..మరి ఇదేంటి పాఠాలు చెబుతున్నారంటారా.. తరగతి కనబడితే ఇప్పుడు డీఈవో అయినా ఒకనాడు మాస్టారే కదా.. అందుకే కడియం మండలం దుళ్ళ ఉన్నత పాఠశాలలో గురువారం ఇలా మాస్టారిగా మారిపోయారు..పదవ తరగతి విద్యార్థులకు హితబోధ చేశారు.ఇంకా మీకు నాలుగు నెలలే సమయం ఉంది.. బాగా కష్టపడి చదవండి.. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలి.. సీ,డీ గ్రేడు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని,నూరుశాతం ఫలితాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. - కడియం



పట్టుదల.. పవర్ లిఫ్టింగ్

ఇతన్నెక్కడో చూసినట్టు ఉందే.. అనుకుంటున్నారా..రాజమహేంద్రవరం ప్రజలకు కాస్త సుపరిచితుడే..క్రీడాకారుడిగా కాదండోయ్.. పారిశుధ్య కార్మికుడిగా..మరి ఇదేంటి అంటారా.. అదే మరి పట్టుదల ఉంటే కానిదిలేదు..తపన ఉంటే సాధించలేనిదిలేదనడానికి ఇతనే నిదర్శనం.. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న అర్జి బాలకృష్ణకు చిన్నతనం నుంచి పవర్ లిఫ్టింగ్ అంటే ఇష్టం..అయితే రెక్కాడితే కానీ డొక్కాడని జీవితం..దీంతో రాజమహేంద్రవరం పారిశుధ్య విభాగంలో 2014 నుంచి పనిచేస్తున్నాడు. ఇటు ఉద్యోగం చేసుకుంటూఅటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు చెన్నై సేలంలో జరిగిన సౌతిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. 74 కేజీల విభాగంలో 10 మంది క్రీడాకారులకు పోటీ ఇచ్చి విజేతగా నిలిచాడు. - రాజమహేంద్రవరం సిటీ



కలెక్టర్..డాక్టర్!

డాక్టర్లు, ఏఎన్ఎంలకు కలెక్టర్ క్లాస్ తీసుకున్నారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు.. ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చారని ప్రశ్నించారు.. సమస్యలు తెలుసుకుని మందులు పరిశీలించారు. ఏఎన్ఎంలు పీహెచ్‌సీలో ఎందుకు ఉన్నారని నిలదీశారు.గర్భిణులకునార్మల్ డెలివరీ అయ్యేందుకు సూచనలు,సలహాలు ఇవ్వడం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కొందరు ఆశావర్కర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు,ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం సిఫారసు చేస్తున్నట్టు తమదృష్టికి వచ్చిందని కలెక్టర్ అన్నారు. వైద్యాధికారి డాక్టర్ వి.కోటేశ్వరరావు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు వివరించారు. ఆసుపత్రిలో బెడ్‌లు పరిశీలించారు. - కోరుకొండ



గోదారి.. మారుతుందోచ్!

అఖండ గోదావరికి పర్యాటక కళ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరికి పర్యాటక కళ రానుంది. వచ్చే పుష్కరాలకు హేవలాక్ బ్రిడ్జి, పుష్కర ఘాట్, కడియం నర్సరీలు, విజ్జేశ్వరం-నిడదవోలు కాల్వ, కోటసత్తెమ్మ గుడి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందనున్నాయి. అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు మంజూరుకాగా అందులో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) పథకం కింద రూ.62 కోట్లు విడుదలచేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషితో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.

- పర్యాటక నిధుల ప్రవాహం
- తొలి విడతగా రూ.62 కోట్లు
- మారనున్న హేవలాక్ వంతెన
- ఇక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కరఘాట్
- కడియం నర్సరీలకు శోభ
- విజ్జేశ్వరం కాలువలో బోట్ షికార్
- త్వరలో టెండర్లు ఆహ్వానం



హేవలాక్ బ్రిడ్జి

రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరిపై నిర్మించిన మొదట రైల్వే బ్రిడ్జిని మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. 127 ఏళ్ల ఈ బ్రిడ్జిని చారిత్రక కట్టడంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. ఈ మేరకు రెండు దశాబ్దాల కిందట అప్పట్లో సీఎం చంద్రబాబు చొరవతో రైల్వేశాఖకు రూ.10 కోట్లు చెల్లించి బ్రిడ్జిని స్వాధీనం చేసుకున్నారు. గత పుష్కరాల సమయంలో అప్పటి సీఎంగా చంద్రబాబు అఖండగోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జి, గోదావరి లంకలు, ఘాట్లు అభివృద్ధి చేయాలని ప్రయత్నించారు. రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి రీజనల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తేసింది. పర్యాటక కళలను ధ్వంసం చేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అఖండ గోదావరికి మళ్లీ జీవంపోసింది. 2,700 మీటర్ల పొడవుతో 18 స్పాన్స్‌తో ఉన్న హేవలాక్ బ్రిడ్జిని సాసి పథకం కింద మల్టీఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. థీమేటిక్, బఫర్ జోన్లుగా విభజించారు. థీమేటిక్ జోన్‌లో వాటర్‌ఫాల్, గ్లాస్ బ్రిడ్జిలు, ఎస్పేస్ థీమ్డ్ జన్, అర్బన్‌హాట్, అక్వేరియం టన్నెల్స్ ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. బఫర్‌జోన్‌లో గోదావరిని వ్యూ పాయింట్ నుంచి చూసేలా అభివృద్ధి చేస్తారు.



కడియం దారిలో

కడియంలో కన్వెన్షన్ సెంటర్..

ఇప్పటికే ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న కడియం నర్సరీలకు మరింత పర్యాటక శోభ రానుంది. కడియపులంకలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. నర్సరీలలో ఒక నర్సరీ నుంచి మరో నర్సరీకి వెళ్లి తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పొట్టిలంక, కడియపులంక, వేమగిరి మధ్య బోట్ షికారు ఏర్పాటుచేసి, నర్సరీలు సందర్శించేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లను ధవళేశ్వరానికి చెందిన ఆర్కిటెక్ట్ భమిడిపాటి కిరణ్ రూపొందించారు.

సమిశ్రగూడెం కాలువలో..


నిడదవోలు కోటసత్తెమ్మ గుడికి మరింత ప్రాధాన్యత సంతరించేలా ఇక్కడ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు. నిడదవోలు ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ఇక్కడ ప్రతిపాదన చేయడంతోపాటు నిధులు మంజూరు చేయించారు. విజ్జేశ్వరం నుంచి నిడదవోలు గుండా వెళ్లే ప్రధాన పంట కాలువలో సమిశ్రగూడెం వద్ద కాలువలో బోటు షికారు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ రెస్టారెంట్ సిద్ధం చేయనున్నారు.



గోదావరి హరివిల్లు.. బోట్ హౌస్

పుష్కర ఘాట్ అభివృద్ధి

ఆధ్యాతిక కేంద్రంగా పుష్కరఘాట్ తీర్చిదిద్దనున్నారు. గోదావరి మాత గుడిని నిర్మించనున్నారు. ఇక్కడ శివపార్వతులు, వినాయక, కార్తికేయ ఆలయాలు నిర్మించనున్నారు. నక్షత్ర స్తంభాలు దివ్యత్వం ఉట్టిపడేటట్టు గోదావరి, ఆస్ట్రాలాజికల్ స్టార్స్ నిర్మించనున్నారు. మండపాలు, మెడిటేషన్, స్పిరిట్యువల్, వాణిజ్య సౌకర్యాలు కల్పించనున్నారు.



వచ్చే పుష్కరాలకు రూపురేఖలు మారుస్తాం..



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు పర్యాటక ప్రాజెక్టులకు రూ. 113.751 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అఖండగోదావరికి, గండికోట ప్రాజెక్టుకు కలిపి మొత్తం రూ.177 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే పుష్కరాలకే రూపురేఖలు మారతాయి.

- కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి

గర్భిణులకు ఫోన్‌లోనే వైద్య సేవలు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు



కిల్కారి సేవల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గర్భిణీలు, బాలింతలకు మొబైల్ ఫోన్ల ద్వారా కిల్కారి సేవలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో కిల్కారి సేవలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. కిల్కారి సేవల్లో భాగంగా తల్లి బిడ్డల ఆరోగ్యానికి సంబంధించి అవసరమైన సలహాలు, సూచనలు వారి మొబైల్ ఫోన్లలోనే ప్రతివారం డాక్టర్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణీలు, బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ వసంత లక్ష్మి, డీసీఎం అర్జున్, కిల్కారి అధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

చలి దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా దగ్గు, జలుబు తదితర శ్వాసకోస సమస్యలు పెరిగే అవకాశం ఉందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది శ్వాసకోస సంబంధిత రోగులను ముందస్తుగా గుర్తించి వారికి ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



నీటి సంఘాలకు.. గ్రీన్‌సిగ్నల్!

ఐదేళ్ల తరువాత అన్నదాతలకు తీపికబురు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- ఫలించిన ఎదురుచూపులు
- వచ్చే నెల 5న నోటిఫికేషన్
- 18న నీటి సంఘాల ఎన్నికలు
- 1997 నుంచి కొనసాగింపు
- గత వైసీపీలో రద్దుకు యత్నం
- కూటమి రాకతో ఎన్నికలు
- జిల్లాలో రైతుల ఆనందం
- గ్రామాల్లో రాజకీయ వేడి

రైతాంగం ఎదురుచూపులు ఫలించాయి. నీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో జిల్లా రైతాంగంలో సందడి నెల కొంది. నీటి సంఘాల ఎన్నికల సంబంధించిన వచ్చే నెల 5న నోటిఫికేషన్ జారీ కానుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు,14న ప్రాజెక్టు కమిటీ (పీసీ) ఎన్నికలు జరగనున్నా యి.18న టీసీ సభ్యులు,నీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. నీటి సంఘాలు ఆయకట్టు పరిధిలోని ఆధునికీకరణ..రైతులకు నీటి సరఫరా తదితర పనులు పర్యవేక్షిస్తాయి..

నాడు చంద్రబాబు అంకురార్పణ

గోదావరి జిల్లాల్లో నీటి సంఘాల ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇవి కూడా రాజకీయ ప్రాబల్యాన్ని కలిగి ఉం టాయి. గ్రామ సర్పంచ్‌లు, ఆయా ప్రాంతాల రాజకీయ పెద్దల నుంచి ఎమ్మెల్యేల వరకూ ఈ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటారు. సీఎం నారా చంద్రబాబునాయుడు 1997లో నీటి సంఘాలకు అంకురార్పణ చేశారు. అప్పటిలో ధవళేశ్వరంలో ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్రస్థాయి సదస్సు పెట్టి.. నీటి సంఘాల ప్రాధాన్యత, వాటి ఎన్నికల గురించి చర్చించారు. అప్పటి వరకూ రైతులకు పెద్ద ప్రాధాన్యత ఉండేది కాదు. గ్రామాల్లో కొందరు పెత్తందార్లు చెప్పినట్టుగా సాగేది. పంటకు కాల్వల ద్వారా నీరు ఇవ్వాలన్నా, కాలువలు, బోదెలు, డ్రెయిన్లు బాగు చేసుకోవాలన్నా ఊరిలో కొందరు పెద్దల ఇష్టానుసారం సాగేది. రైతుల నుంచి డబ్బులు కూడా వసూలు చేసి నొక్కేసేవారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పక్కదారి పట్టించేసేవారు. డెల్టా సిస్టమ్ నిర్వహణ సరిగ్గా ఉండేది కాదు. కానీ చంద్రబాబు ఆలోచన వల్ల నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత ఇరిగేషన్ ద్వారా నీటి సంఘాలకు కొంత డబ్బు కేటాయించి, ఆయా ప్రాంతాల్లోని కాలువలు, బోదెలు, డ్రెయిన్లు క్లీన్ చేయించడం మొదలైంది. కాల్వల తూడు, సిల్ట్ తొలగింపు పనులు చేశారు. నీటి సంఘాల ఏర్పాటుతో గ్రామాల్లో అన్ని రైతు వర్గాల్లోనూ చైతన్యం పెరిగింది.1999లో మొదటి ఎన్నికలు జరగ్గా తర్వాత 2002, 2008, 2015లో జరిగాయి. అందులో 2008లో తప్ప మిగతా మూడు సార్లు చంద్రబాబు సీఎంగా ఉండగానే ఎన్నికలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలే నిర్వహించలేదు. వీటిని రద్దు చేసే యోచన కూడా చేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో నీటి సంఘాలు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి పరిధిలో ఎన్నికలు జరిగేవి. ప్రస్తుతం జిల్లాల విభజన వల్ల ఏ జిల్లా పరిధిలో ఆ జిల్లాకే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కానీ తూర్పు, మధ్య డెల్టాలకు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు కాకినాడ, అమలాపురం పరిధిలో జరగనున్నాయి. పశ్చిమ డెల్టాకు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో జరగనున్నాయి.

జిల్లాలో 113 నీటి సంఘాలు..

తూర్పుగోదావరి జిల్లాలో 113 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుష్కర పంపింగ్ స్కీమ్, తొర్రిగడ్డ ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఎన్నికలు ఉంటాయి. మేజర్ ఇరిగేషన్ పరిధిలో 6నుంచి 12 టీసీ (ప్రాదేశిక కమిటీ)లు ఉంటాయి. మొదట టీసీలను రైతులు ఎన్నుకుంటారు. టీసీ సభ్యులు నీటి సంఘాల ప్రెసిడెంట్ , ఇతర కమిటీని ఎన్నుకుంటారు.వీరు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు.ఈ కమిటీలు జిల్లా స్థాయిలో ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని పనులు చేస్తారు. జిల్లాలో 18 మండలాలు ఉన్నప్పటికీ, కొవ్వూరు, రాజమహేంద్రవరం అర్బన్, తాళ్లపూడి ,చాగల్లు మండలాల్లో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఆయకట్టు లేదు. అందువల్ల అక్కడ ఎన్నికలు నిర్వహించడంలేదు. ఇక ప్రాజెక్టు కమిటీ,డీసీ సభ్యుల ఎన్నికకు రాజకీయ ప్రాధాన్యత ఉంటుంది. నీటి సంఘాల ఛైర్మన్ల ఎన్నికపై గ్రామాల్లో రసవత్తరంగా ఉంటుంది.



పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జేసీ

జ్యోతి రావు పూలేకు ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమంలో జేసీ పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ . జ్యోతి, బీసీ సంక్షేమ అధికారి సత్యరమేష్, అధికారులు పూలమాలలు వేశారు. గోదావరి బండ్ రోడ్డులోని జ్యోతి రావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పూలమాలలు వేశారు.

డిసెంబరు 1 నుంచి రబీ నీటి విడుదల

సాగునీటి సలహా మండలి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సాగు కోసం డెల్టా కాలువలకు డిసెంబర్ 1 నుంచి ధవళేశ్వరం బ్యారేజి నుంచి నీటిని విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024- 25 రబీ సీజన్‌లో తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల పరిధిలో 8,96,507 ఎకరాల ఆయకట్టుకు సాగు, మంచినీటి అవసరాలకు నీటిని అందిస్తామని తెలిపారు. తూర్పు డెల్టాకు 2,64,507 ఎకరాలు, పశ్చిమ డెల్టాకు 4, 60,000 ఎకరాలు, సెంట్రల్ డెల్టా(కోనసీమ)కు 1, 72,00 ఎకరాల ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. ప్రస్తుతం గోదావరి నదిలో 91.35 టీఎంసీల నీరు ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లా రబీ ఆయకట్టుకు గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు సంబంధించి 27,001 ఎకరాలకు, గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు సంబంధించి 35,710 ఎకరాలు, తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం ద్వారా కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 1650 ఎకరాలకు, కలిపి మొత్తం 64,361 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. ఎర్రకాలువ, కొవ్వాడ కాల్వల కిందట గోపాలపురం, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని ఆయకట్టు వరదలు, భారీ వర్షాల కారణంగా ప్రతి ఏటా అనేక వేల ఎకరాల ఆయకట్టు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల కాల్వల ఆధునీకరణ పను లు చేపట్టి, గండ్లు పూడ్చి వేసి, ఏటిగట్లు పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎర్రకాలువ, కొవ్వాడ, చింతలపూడి, తొర్రిగడ్డ, సీతానగరం ప్రాజెక్టుల ఈఈలు ఆయా ప్రాజెక్టుల పరిధిలో సీజన్‌వారీగా సాగు విస్తీర్ణం, ఆయకట్టు సాగు అంశాలకు సంబంధించిన వివరాలు నివేదిక రూపంలో వివరించారు. పురుషోత్తపట్నం, చింతలపూడి, పట్టిసీమ, వెంకటనగర్ ఎత్తిపోతల పథకాల పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.చి న్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా నీటిపారుదల అధికారి జి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్,రాణి సుష్మిత,జిల్లా వ్యవ సాయాధికారి ఎస్.మాధవ రావు, ఎంసీ కెనాల్ ఎస్ఈ ఏసుబాబు, ఏలూరు ఎస్ఈ దేవ ప్రకాష్,ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బి.వెంకటగిరి, వ్యవసాయ శాఖ ఏడీలు పాల్గొన్నారు.



నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతికి సమస్యలు విన్నవిస్తున్న ఇరిగేషన్ అధికారులు..చిత్రంలో ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుష్మిత, ఇతర అధికారులు

మా ఊరు.. 'మొగళ్లమూరు'





మొగలి పుష్పాలే ఊరు పేరు

ఊరంతా మొగలి చెట్లే





సువాసన ఇచ్చే పూలు ఎన్నున్నా మొగలి పువ్వులు ప్రత్యేకత వేరు. ముళ్లతో ఏమాత్రం తాకడానికి వీలుకాని రీతిలో ఉండే ఈ చెట్లకు పూసే పూలు ఆ ప్రాంతమంతా సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. ఇది వరకు ఊరారూ పొలాలకు వెళ్లే దారిలో మొగలి చెట్లు కనిపించేవి. ఇప్పుడు వాటి జాడే సరిగా కనిపించడం లేదు. అయితే అసలు ఈ మొగలి పూల పేరుతోనే ఒక ఊరుంది. ఆ ఊరి పేరు 'మొగళ్లమూరు'. పేరుకు తగ్గట్టు ఇప్పటికీ మొగలి చెట్లకు నెలవుగా ఆ ఊరు పరిమళిస్తోంది.

సువాసనలు వెదజల్లే మొగలి పుష్పాలకు ఉన్న ఆకర్షణ వేరు. పువ్వు లంటే ఇష్టపడే వారంతా మొగలి పూలంటే ఇంకా ఇష్టపడ తారు. ఇలా మొగలి పూల పేరుతో ఒక ఊరే ఉంది. అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం మొగళ్లమూరు. మొగలి పొదలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో దీనికి ఆ పేరు స్థిరపడినట్టు చెబుతారు. ఇప్పటికీ అతిపొడవైన మొగలి పుష్పాల చెట్లతో కూడిన పొదలు చాలా ఉన్నాయి. ముళ్లు కలిగి పచ్చని ఆకులతో ఉండే మొగలి చెట్టు కాండంపై శివారు భాగాన పసుపు రంగు కలిగి సువాసనలు వెదజల్లే మొగలి పుష్పాలు పూస్తాయి. ఈ మొగలి పుష్పాల పొప్పిడి పుష్పాల రేకుల నుంచి అత్తర్లు, అగరవత్తులు తయారు చేస్తా రు. అలాగే చిన్నసైజు తొండాల వలే కాండాలకు వేలాడే వేరు భాగాలను కోసి నారా తీసి బుట్టల అలికకు ఉపయోగిస్తారు. పడిపోయిన కాండం ముక్కలతో కాలువలు, చెరువుల్లో నీటి అడుగున ఉంచి దొందులు, బొమ్మిడాయిలు, కొరమేను చేపలు పట్టడానికి ఉపయోగిస్తారు. మొగళ్లమూరు, కొమరగిరిపట్నం, ఓడలరేవు గ్రామాల్లో ఈ చెట్లు నేటికి కనిపిస్తున్నాయి. మొగలి పుష్పాలు పెళ్లిళ్ల, శుభాకార్యాల్లో అలంకారాలకు మంచి డిమాండ్ ఉంది. **- అల్లవరం**



రుచిలో జీడిపప్పు రారాజు. ఏ వంటకం తయారులోనైనా జీడిపప్పు కలిసిందంటే దాని టేస్ట్ మారిపోతుంది. ఇక విడిగా జీడిపప్పునే స్నాక్ ఐటమ్స్‌గా తినడం చాలామందికి ఇష్టం. బెల్లంపాకంతో పట్టిన జీడిపప్పు అచ్చుకి యమా క్రేజు. కారంగా కరకరలాడుతూ ఉండే 'రోస్టెడ్ కాజు' తింటే ఆహా అనాల్సిందే. ఇవి ఎక్కడైనా దొరుకుతాయిగానీ, జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ కేంద్రం అయిన మోరిలో తయారయ్యే జీడిపప్పు స్వీటు, హాటుకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.

తింటే మర్చిపోరు.. మోరి జీడిపప్పు అచ్చులు



రుచిలో అమోఘం బెల్లం అచ్చులు.. కరకరలాడే స్పైసీ, రోస్టెడ్ కాజులోనూ స్పెషల్

తీయదనం.. కమ్మదనంతో నోటికి కరకరలాడే మోరి జీడిపప్పు ఎంతో రుచికరం. ఆరోగ్యకరం. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో మోరి గ్రామానికి రాష్ట్రంలోనే పేరుంది. ఇక్కడ నుంచి దేశవిదేశాలకు జీడిపప్పు ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక్కడ నెంబర్ వన్ క్వాలిటీ మోరి జీడిపప్పు కిలో రూ.850 ధర పలుకగా, ఆ జీడిపప్పును వివాహాది శుభకార్యాలు, విందు భోజనాల్లో కూరల్లో ఉపయోగిస్తుంటారు. మోరి జీడిపప్పు వల్ల ఆ వంటలు రుచికరంగాను, అమోఘంగా ఉంటాయని భోజన ప్రియులు చెబుతారు. ఆ మోరి జీడిపప్పును ఇటీవల సారెల్లోను, స్వీట్లు, అచ్చుల రూపంలో బెల్లం పాకంతో తయారుచేసి విక్రయిస్తున్నారు. నిశ్చయ తాంబూలాలు, వివాహాది శుభాకాంక్షలు తెలిపేటప్పుడు హృదయాకారంలో అచ్చులను తయారుచేసి స్వీట్లు బాక్సుల్లో అందిస్తున్నారు. తోటి స్నేహితులు, బంధువులు, ఉన్నతాధికారులు వీటిని రుచి చూసిన అనంతరం మళ్లీ తమకు మోరి జీడిపప్పు అచ్చులు కావాలని తెప్పించుకుంటూ ఉంటారు. బెల్లం పాకం పట్టిన జీడిపప్పు అచ్చు రూ.750 ధర ఉండగా, స్పైసీ, రోస్టెడ్ జీడిపప్పు కిలో రూ.950 ధర పలుకుతుంది. మోరిలో ప్రధానంగా బెల్లంపాకంతో తయారుచేసే కంగుట్ల రామారావు వంద గ్రాముల నుంచి కిలోల లెక్కన ఎన్ని ఆర్డర్లు వచ్చినా ఉదయం పూట తయారుచేసి అప్పటికప్పుడు అందివ్వడంతో మోరి జీడిపప్పును రుచిచూసిన వారందరూ ఆహా ఏమి రుచి అని కితాబిస్తున్నారు. ఇటీవల కాలంలో విందు భోజనాల్లో జీడిపప్పు లేని వంటకం లేదు. ఈ జీడిపప్పు తయారీపై చిన్నా పెద్దా తేడా లేకుండా మోరి గ్రామ ప్రజలంతా ఉపాధి పొందుతున్నారు. మోరికి ఆనుకుని ఉన్న ఇతర గ్రామాల వారు కూడా జీడిపప్పు తయారీలో భాగస్వాములై లబ్ధి పొందుతున్నారు. **- అంతర్వేది**





పుట్టినరోజులు, పెళ్లిరోజులు, శుభకార్యాల కోసం హృదయాకారంలో జీడిపప్పు అచ్చు



పచ్చబొట్టేసినా...

- టాటూలకు విశేష ఆదరణ
- నాటి పచ్చబొట్టు ... నేడు టాటూ
- వివిధ ఆకృతుల్లో శరీరంపై ముద్ర
- ఆసక్తి కనబరుస్తున్న యువత

పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాజా అని పలకరించినా.. పచ్చబొట్టేసినా పిల్లగాడా నిన్ను.. అంటూ పులకరించినా గుండెల నిండా చెదిరిపోని ప్రేమావేశానికి నిదర్శనమది. అదిప్పుడు ఒళ్లంతా చెరగని ముద్రవేసుకుంటోంది. నిన్నటి పచ్చబొట్టు నేడు టాటూగా ఆకర్షించి ఆదరణ పొందుతోంది. ఇష్టమైన వాళ్ల రూపాన్ని, పేర్లని అందమైన ఆకృతులతోపాటు వివిధ రకాల జంతువులు, పక్షులన్నీ రమణీయంగా ఒళ్లంతా ఆవిష్కరిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు టాటూలకు మొగ్గుచూపుతుండడంతో ప్రస్తుతం టాటూల ట్రెండ్ నడుస్తోంది. రెండు దశాబ్దాల కిందటి వరకు ఇష్టమైన పేర్లు, ఆకారాలను పచ్చరూపంలో పొడిపించుకునేవారు. ఈ విధానం పూర్తిగా నాటు పద్ధతిలో ఉండేది. పచ్చపొడుపించుకున్న వారు రెండ్రోజులపాటు జ్వరంతో బాధపడే పరిస్థితి ఉండేది. ఈ విధానం కనుమరుగైంది. ఇదే తరుణంలో టాటూ సంస్కృతి విస్తృతంగా వ్యాప్తించింది.

సూదులతో పచ్చబొట్టు...

యువతను ఆకర్షించేందుకు సినిమా థియేటర్ల వద్ద పచ్చబొట్టు పొడిచేవారు సిద్ధంగా ఉంటున్నారు. ముందుగా చెక్కతో తయారు చేసిన అచ్చుతో ముద్రవేస్తారు. ముద్రకు అనుగుణంగా సూదులతో పచ్చబొట్టు వేస్తారు. ఆకృతులను బట్టి ధర చెల్లించాల్సి ఉంటుంది. టాటూల్లో చాలా రకాలున్నాయి. యువతను ఆకర్షించేందుకు లవ్ సింబల్, హార్ట్ సింబల్, సీతాకోక చిలుక, నెమలి పించం, ఓంకారం, పుర్రే, డైనోసర్, కోడిపుంజు, సింహంతోపాటు వివిధ ఆకృతులు అందుబాటులో ఉన్నాయి. కొందరు అక్షరాల రూపంలో టాటూలు వేయించుకుంటున్నారు. షాపింగ్ మాల్స్ ముఖ్యకూడలిల వద్ద యువతను ఆకర్షించేందుకు టాటూ కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. మిషన్లతో నచ్చిన ఆకారాలు, ఆకృతులు, పేర్లను రాస్తున్నారు. ఇక ఫంక్షన్ల వద్దా టాటూ కౌంటర్లను పెడుతున్నారు.

సూదులతో జాగ్రత్త...

నాటు పద్ధతిలో శరీరంపై వేయించుకునే పచ్చబొట్టు విషయంలో జాగ్రత్తలు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సూదితో వేసే ముద్ర పొడిపించుకునే సందర్భంలో ఒకరికి ఉపయోగించిన సూదిని వేరొకరికి ఉపయోగించడం ప్రమాదకరం. కొత్త సూదులను మాత్రమే వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. **- రావులపాలెం**





చింతూరు-మారేడుమిల్లి మధ్య ఘాట్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

ఘాట్ కష్టాలు గట్టెక్కినట్టే!

చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మరమ్మతులకు రూ.5.21 కోట్లు మంజూరు

చింతూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు ఘాట్ రోడ్డు మరమ్మతులకు భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయి. చింతూరు- మారేడుమిల్లి మధ్యం దూరం 51 కి.మీ.గా ఇందులో ఘాట్ 28 కి.మీ. గత ఐదేళ్లలో ఈ రోడ్డు మెయింటెనెన్స్ పనులు ముట్టలేదు. దీంతో పలు ప్రదేశాల్లో గుంతలు పడ్డాయి. మరి కొన్ని ప్రదేశాల్లో రహదారి అంచులు వర్షం ధాటికి కొట్టుకుపోయాయి. దీంతో అటువైపు ప్రయాణం అసౌకర్యంగా, ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారి మీదుగా మన రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్రలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న రహదారిని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రూ.4.21 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ సిద్ధమైంది. వేర్వేరుగా రెండు టెండర్లు పిలిచింది. మొదటిది చింతూరు-మారేడుమిల్లి మధ్య తాత్కాలిక మరమ్మతులకు రూ.46 లక్షలు కేటాయించింది. వీటికి టెండరు ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు మొదలు కానున్నాయి. రెండో టెండరులో ఘాట్‌లో 8 కి.మీ. మేర పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు కేటాయించింది. లక్కవరం నుంచి చింతూరు వరకు 4 కి.మీ. మరమ్మతులకు రూ.1.75 కోట్లు కేటాయించారు. ఈ రెండు పనులు టెండర్ దశలో ఉన్నాయి.





నాయకంపల్లి శివపంచాయతన క్షేత్రంలో భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న విధు శేఖర భారతీ మహాస్వామి

నాయకంపల్లిలో సనాతన ధర్మ ప్రచారం

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానం ఉండనే ఉందని శంకరాచార్యులు ఈ లోకానికి తెలియజేశారని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామస్తులు, భక్తుల సహకారంతో నిర్మించిన శివపంచాయతన క్షేత్రంలోని సువర్ణ భారతి గోశాల, సువర్ణ భారతి పాకశాల, సువర్ణ భారతి ప్రవచన మంటపములను గురువారం ఆయన ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఇవాళ్టి రోజున ఇటువంటి ధార్మిక వాతావరణం, క్షేత్రం, సనాతన వైదిక ధర్మ పరంపరను చూస్తున్నామంటే దానికి కారణం నిస్సందేహంగా జగద్గురువులు ఆదిశంకరచార్యులేనన్నారు. తత్వం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస బంగారయ్య శర్మ మాట్లాడుతూ ఈ క్షేత్రం భవిష్యత్తులో దేదీప్యమానంగా వెలుగొందుతుందన్నారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పీవీ జనార్దన్‌నాయుడు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, చైతన్య విద్యా సంస్థల అధినేత చైతన్యరాజు, మలిరెడ్డి పాపారావు, ఎస్వీఎస్ అప్పలరాజు, జెట్టి గ్రానైట్ అధినేత శివకుమార్, జాస్తి వసంత్, పోతుల మోహనరావు, కుంచే రాజా, బూరుగుపల్లి వెంకటరావు, ఎస్ఆర్‌కే రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామికి ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని మూలవర్లకు ప్రత్యేక పూజలు

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి గురువారం రాత్రి సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు, ఛైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవరులకు మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతిఏటా తన గురువు భారతీ తీర్థానంద పేరున చైత్ర శుద్ధ షష్ఠి రోజున అన్నదానం జరిపించాలని కోరారు.



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న యనమల దంపతులు

కుమ్మరిలోవ తపోవనంలో

విధు శేఖర భారతీ మహాస్వామి

తుని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ కాశీగా పేర్గాంచిన కుమ్మరిలోవ తపోవనానికి శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి విచ్చేశారు. ఆయనకు తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మహా స్వామికి సచ్చిదానంద సరస్వతి ధూళి పాదపూజ నిర్వహించారు. సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించారు. శ్రీరుద్రయాగ పూర్ణాహుతిలో మహాస్వామి పాల్గొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులే. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అన్నవరం దేవస్థానం ఈవో త్రినాథ రావు, లోవ దేవస్థానం ఈవో, ఉప కమిషనర్ పి.విశ్వనాథ రాజు, దేవదాయ శాఖ ఆర్జేసీ కొమ్ముల సుబ్బారావు స్వామి ఆశీస్సులు పొందారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు సచ్చిదానంద సరస్వతి స్వామి శిష్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి తపోవనం క్షేత్రం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

సత్యదేవుని సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ విచ్చేశారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో త్రినాథరావు, ఛైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ వున్నారు.



దర్శనానంతరం కమిషనర్ సత్యనారాయణ



పసుపు వస్త్రాలతో రత్నగిరి చేరుకున్న పల్లం గ్రామస్తులు

పల్లం నుంచి రత్నగిరికి...

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామం నుంచి సుమారు 500 మంది భక్తులు సత్యదేవునికి ప్రీతిపాత్రమైన పసుపు రంగు వస్త్రాలతో రత్నగిరికి చేరుకున్నారు. ఈనెల 25న పల్లంలో బయల్దేరామని, హిందూ ధర్మ భాగంగా ప్రతిఏటా ఈ విధంగా పాదయాత్రగా వస్తున్నామన్నారు. పల్లం గ్రామస్తులకు అన్నవరం దేవస్థానం ప్రొటోకాల్ సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ అల్పాహారం, వసతి ఏర్పాట్లు చేశారు.



ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న మహిళలు

సాంబశివునికి సారె సమర్పణ

ఏలేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఏలేశ్వరం పట్టణంలో వేంచేసియున్న గౌరీ సాంబశివుని ఆలయానికి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు సారె సమర్పించారు. గురువారం వారి నేతృత్వంలో పసుపు, కుంకుమ, పండ్లు, స్వీట్లు, పువ్వులు, చీర, రవిక, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కటకం కిరీటి, బెల్లాని శ్రీను, ఉడతల రామణారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- వచ్చేనెల 5న ఎన్నికలు
- 9న ఫలితాలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. వచ్చే నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డిసెంబరు 5న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 9న ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. ఇప్పటికే ఎన్నికల బ్యాలెట్ పత్రాలు రాగా ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఆరుజిల్లాల పరిధిలో 16737 మంది ఓటర్లు ఉండగా 19150 బ్యాలెట్ పత్రాలు సిద్ధంచేశారు. దీనికోసం 230 బాక్సులు సిద్ధం చేశారు.ఆరుజిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకోసం 141మంది పీవోలు, 141మంది ఏపీవోలు,279మంది ఓపీవోలు, 141మంది సూక్ష్మపరిశీలకులను నియమించారు. ఆరు జిల్లాలకు 54, రూట్లు 32 జోన్లుగా విభజించారు. దీనికి రూట్, జోనల్ ఆఫీసర్లు, 88మందిని నియమించారు.ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు తలపడుతున్నారు.

నేడు పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఏపీపీజీసెట్ రాయకపోయినా, రాసి అర్హత సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చునన్నారు. డిగ్రీలోఉత్తీర్ణతా శాతం ఓసీ, బీసీ 50శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45శాతం సాధించినవారు పీజీ ప్రవేశాలకు అర్హులన్నారు. ఉదయం 11గంటల్లోపు సంబంధిత విశ్వవిద్యాలయంకళాశాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు.

తీరం అల్లకల్లోలం



ఉప్పాడలో అలల ఉధృతికి కొట్టుకుపోయిన మత్స్యకారుల ఇళ్లు

- 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో తీరంలో ఈదురుగాలులు
- అలల ధాటికి మత్స్యకారుల ఇళ్లపైకి వచ్చి పడుతున్న సముద్రనీరు



ఉప్పాడలో అల్లకల్లోలంగా మారిన సముద్రం

కొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం మధ్యలో కెరటాలు సుడులు తిరుగుతూ తారాస్థాయికి ఎగిరిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలో లంగర్ వేసిన తమ బోట్లను రామన్నపాలెం ఉప్పుటేరు వద్దకు తరలించి భద్రపరుచుకున్నారు. తీరప్రాంతంలో సముద్రం ఉదయం నుంచీ అల్లకల్లోలంగా ఉండడం, ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు ఒడ్డున మకాం ఉంటున్న మత్స్యకారుల ఇళ్లలోకి దూసుకొస్తున్నాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు అంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. ఇటీవలకాలంలో తరచూ ఏర్పడుతున్న తుపాన్, అల్పపీడనాలతో వేట లేకపోవడంతో జీవనోపాధికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీంతో కుటుంబాలను అప్పులు చేసి పోషించుకోవాల్సిన అగత్యం ఏర్పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట విరామ సమయంలో ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న డీఈవో రమేష్.. క్రీడాకారుల ర్యాలీ

కాకినాడ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రమేష్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసం అందిస్తాయన్నారు. డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అండర్-17 బాలికల విభాగంలో మూడు రోజులపాటు జరిగే పోటీల్లో వివిధ జిల్లాలనుంచి అధికారులతో సహా 200మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు కె.ఈశ్వరరావు, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివరామకృష్ణ, గీతం స్కూల్స్ అధినేత సుజ్ఞాన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎన్ రామ్‌ప్రసాద్, చైర్మన్ కేవీబీ మోహనరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కౌర్,ఎస్‌జీ టీ సహాయ కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలే వీరే

కృష్ణా జిల్లాపై కర్నూలు జట్టు 13.9 స్కోర్‌తో గెలుపు, ప్రకాశంపై శ్రీకాకుళం 13.3, విశాఖపై తూర్పుగోదావరి 9.5, పశ్చిమగోదావరిపై నెల్లూరు 12.0, చిత్తూరుపై అనంతపురం 11.2, కృష్ణాపై శ్రీకాకుళం 13.1, కర్నూలుపై ప్రకాశం 22.10, విశాఖపై గుంటూరు9.1, నెల్లూరుపై కడప 10.0, చిత్తూరుపై విజయనగరం 10.0, పశ్చిమపై కడప 5.0 స్కోరుతో గెలుపొందాయి.

నేటినుంచి అంతర జిల్లాల బాలికల బాల్ బాడ్మింటన్ పోటీలు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఈనెల 29,30 తేదీల్లో అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం పి.వీరప్రభాకరరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఆయన కిట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీడీలు ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులుశ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



బాలికలకు అందించిన కిట్లతో హెచ్ఎం, పీడీలు

జాతీయస్థాయిలోను సత్తా చాటాలి

- రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు ప్రారంభించిన కోనసీమ కలెక్టర్



అనంతపురం జట్టుతో కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తిని చాటుతూ క్రీడాకారులు రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలోను ఇనుమడింప చేసేలా రాణించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ క్రీడా పోటీలను కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించా రు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పండుగ వాతావరణంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు వివిధ జిల్లాల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కుడుపూడిసూర్యనారాయణరావు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శులు తోట రవి, గోవిందరావు, పి.విష్ణుప్రసాద్, ఫణీంద్రకుమార్,యూవీ ముసలయ్య, కిశోర్, మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చొల్లంగి ప్రసాద్, కార్యదర్శి టీవీవీఎస్ఎన్ మూర్తి, జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, ఎంఈవో రేలంగి నాగకుమార్, విత్తనాల శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో కొట్లాట

- ఒకరికి తీవ్రగాయాలు, ముగ్గురికి గాయాలు
- డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో ఘటన

కాట్రేనికోన, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లం గ్రామంలో టీడీపీకి చెందిన దోమ మణికంఠ, బొమ్మిడి ప్రసాద్, మల్లాడి కొండయ్య, వైసీపీకి చెందిన కాటం శ్రీను మధ్య మద్యం మత్తులో వివాదం తలెత్తింది. దీంతో పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. తనను మణికంఠ, ప్రసాద్, కొండయ్య గాయపరిచారంటూ వైసీపీకి చెందిన కాటం శ్రీను పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ముమ్మిడివరం ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మల్లాడి కొండయ్యకు తలపై తీవ్రగాయం కావడంతో బొమ్మిడి ప్రసాద్ తన వాహనంపై ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండడంతో అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐను వివవరణ కోరగా ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మల్లాడి కొండయ్యకు తలపై గాయానికి కారణమేంటో విచారణ నిర్వహిస్తామన్నారు. రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామన్నారు.



గాయపడిన మల్లాడి కొండయ్య

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

- సామర్లకోట మీదుగా 44 స్పెషల్ రైళ్ల రాకపోకలు
- వారంలో రెండురోజులు.. మూడు నెలలపాటు ఉండేలా ప్రణాళిక
- అయ్యప్ప దీక్షాధారులకు రైల్వే ప్రయాణ సదుపాయం



సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలనుంచి అయ్యప్ప దర్శనంకోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్డు, హైదరాబాద్, కాచిగూడ నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసింది. అందులో సామర్లకోట మీదుగా విశాఖ, శ్రీకాకుళం రోడ్ నుంచి రానుపోను ఏర్పాటు చేసిన 44 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే పీఆర్వో కార్యాలయం ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే శబరిమల అయ్యప్ప దర్శనార్థం దీక్షాధారణలో వెళ్లే అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా అటు విశాఖ నుంచి, శ్రీకాకుళం రోడ్‌ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. ఈ మేరకు సామర్లకోట ఆంధ్రజ్యోతి ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని సేకరించింది.

- 08539 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ విశాఖ-కొల్లాం మధ్య ప్రతి బుధవారం విశాఖ నుంచి రాత్రి 8.20 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు గురువారం అర్ధరాత్రి 12.55 గంటలకు కొల్లాం చేరుకోనుంది. డిసెంబరు 4 నుంచి 2025, ఫిబ్రవరి 26 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1, 8, 15, 22, 29, ఫిబ్రవరి 5, 12, 19, 26తేదీల్లో 13 ట్రిప్పులుగా ప్రతి బుధవారం నడవనుంది.
- 08540 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-విశాఖ మధ్య ప్రతి గురువారం కొల్లాం నుంచి రాత్రి 7.35 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖకు చేరుకోనుంది. డిసెంబరు 5 నుంచి 2025, ఫిబ్రవరి 27 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 5, 12, 19, 26, జనవరి 2, 9, 16, 23, 30, ఫిబ్రవరి 6, 13, 20, 27తేదీల్లో 13ట్రిప్పులుగా ప్రతి గురువారం నడువనుంది.

ఈ రైళ్లు దువ్వాడ మీదుగా సామర్లకోటకు 11.19 గంటలకు, రాజమండ్రికి 12.21 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలారిపెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, చంగనస్సెరి, తిరువళ్ల, చెంగనూర్, మావెలియకరి, కాయంకులంల మీదుగా కొల్లాం జంక్షన్‌కు రెండు రోజులు అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,562 కిలోమీటర్ల దూరంలో 28 స్టేషన్లలో ఆగనుంది.

- 08553 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళంరోడ్-కొల్లాం మధ్య ప్రతి ఆదివారం బయలుదేరనుంది. ఈ రైలు ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో 9ట్రిప్పులుగా ప్రతిఆదివారం నడుస్తుంది.
- 08554 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రతి సోమవారం బయలుదేరనుంది. ఈ రైలు ప్రతి సోమవారం 4.30 గంటలకు బయలుదేరి బుధవారం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20, 27వతేదీల్లో 9 ట్రిప్పులుగా నడువనుంది.

ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్, పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా సామర్లకోటకు ఉదయం 10.18గంటలకు చేరుకుని రాజమండ్రికి 11.03గంటలకు చేరుతుంది. ఏలూరు, విజయవాడ, ఒంగోలు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, ఎట్టుమన్నార్, కొట్టాయం, చంగనస్సెరి, తిరువళ్ల, చంగన్నార్, మావెలియాకర్, కాయంకుళం మీదుగా కొల్లాంకు మధ్యాహ్నం 2.30 గంటలకు రెండు రోజుల అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,691 కిలోమీటర్ల దూరంలో 34 స్టేషన్లలో ఆగనుంది. ఈరైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కట్లు పొందవచ్చని ప్రకటించారు.

గుర్తుతెలియని కారు ఢీకొని గాయాలు

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని కారు ఢీకొని ఒక మత్స్యకారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన రేకాడి కరుణకుమార్ మత్స్యకారుడు. ఈనెల 24న పనిమీద కాకినాడ వచ్చి తిరిగి వెళ్తుండగా కరప మండలం చొల్లంగి బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన కరుణకుమార్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకున్నాడు. బాధితుడు గురువారం కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వెంకన్న ఆలయంలో టీటీడీ చైర్మన్ నాయుడు పూజలు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చక బృందం ఘనస్వాగతం పలికింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి ప్రదక్షిణలు నిర్వహించుకుని కుటుంబ సభ్యులతో ఆయన స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో పండితులు వేదాశీర్వచనం అందచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీటీడీ చైర్మన్ నాయుడు దంపతులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం అందచేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలుతగా చైర్మన్ నాయుడుని ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, ముత్యాల బాబ్జి, తదితర నేతలు ఆయనకు స్వాగతం పలికారు.



టీటీడీ చైర్మన్ నాయుడుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

5న కాకినాడలో 'వేగ జ్యూయలర్స్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వేగ జూయలర్స్ అధినేతలు

కాకినాడ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న కాకినాడలో వేగ జ్యూయలర్స్ 4వ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. గురువారం హోటల్ రాయల్ పార్క్‌లో వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 5వతేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు కాకినాడ బాలాజీచెరువు దగ్గరలో వేగ షో రూమ్‌ను సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, సినీనటి సంయుక్త మీనన్ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా డిసెంబర్ 5 నుంచి 12 వరకు బీఐఎస్ హాల్మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫికెట్స్‌తో డైమండ్స్ ప్రత్యేక రాయితీ, ఆఫర్లతో అందించనున్నామన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లను కాకినాడ, పరిసర ప్రాంత ప్రజలందరూ వినియోగించుకోవాలని, రాబోయే క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగలను మరింత ఆనందంగా జరుపుకోవాలన్నారు. వివాహ ముహూర్తాలు, వివాహ వేడుకల కోసం సంప్రదాయ ఆభరణాలనుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా విజయవాడ, హైదరాబాద్‌లో ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించి ఖాతాదారుల విశ్వాసం పొందామన్నారు. కాకినాడలో షోరూమ్ ప్రారంభం తర్వాత రాజమహేంద్రవరంలో ప్రారంభిస్తామన్నారు. కాకినాడ ప్రజలు తమ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ప్రోత్సహించాలన్నారు. సంస్థకు సంబంధించి సినీనటుడు బాలకృష్ణ ప్రచారకర్తగా నటించిన యాడ్‌ఫిల్మ్‌ను విడుదల చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.40లక్షల ఎక్స్‌గ్రేషియా

- మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మా పరిధిలో ఠాగూర్ ల్యాబ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతులు ఒక్కో కుటుంబానికి రూ.40లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని కార్మిక, పరిశ్రమల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. ఈనెల 26న సాయంత్రం 4.40 గంటలకు ఠాగూర్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రియాక్టర్ జీఎల్ 325వద్ద హెచ్‌సీఎల్ క్లోరోఫామ్ లీకేజీ ప్రమాదంలో కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ అదేరోజున ఒకరు మృతి చెందగా గురువారం మరొకరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఐసీయూలో ఉన్న మరోకార్మికుడు పరిస్థితి ఆందోళకరంగా ఉందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.40లక్షల చొప్పున చెల్లించేందుకు సంస్థ యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందన్నారు. లీకేజీ ఘటనపై విచారణ జరిపించి నిర్లక్ష్యం వహించిన సంస్థపై చర్యలు తీసుకున్నామని మంత్రి సుభాష్ అన్నారు.

గంజాయి కేసుల్లో నిందితుల అరెస్టు

మోతుగూడెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో ఐదుగురు నిందితులు, ఒక మైనర్‌ని అరెస్టు చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసి వ్యసనాలకు అలవాటు పడి గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టు చేసిన డొంకరాయి పోలీసులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఐపీఎస్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కి వచ్చిన సమాచారంతో గురువారం 23 కిలోల గంజాయి రవాణా చేస్తున్న విజయవాడ ప్రాంతానికి చెందిన ఇందుకూరి త్రినాథ్, డికొండ రాజేష్, రెళ్ల సాయికిరణ్, ఓమైనర్‌ను పట్టుకున్నారు. వారిలో ముగ్గురిని రిమాండ్‌కి తరలించారు. మైనర్‌ను జువనైల్ హోమ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ నలుగురు విజయవాడ, మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తారని, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మి వచ్చిన సొమ్ముతో గంజాయిని కొనుగోలు చేస్తున్నారని పోలీసులు తెలిపారు. దొంగిలించిన మూడు ద్విచక్రవాహనాలను గుంటూరు శివారు ప్రాంతంలో ఉంచగా వాటిని పోలీసులు రికవరీ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా హోండా లియో బైక్‌పై రెండు కిలోల గంజాయి అక్రమ రవాణా చేస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన వీపు వెంకటేష్, మరిగల మణికంఠలను అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడి వచ్చిన సొమ్ముతో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన డొంకరాయి రైటర్ శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుల్ పోశయ్యను ఏఎస్పీ అభినందించారు.

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో..

ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంపు

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య నడిచే 07445నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చేనెల 6 నుంచి 30 వరకూ పొడిగిస్తూ రైల్వే పీఆర్వో ఎ.శ్రీధర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు గురువారం అందాయి. ఈ రైలు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కాకినాడ టౌన్ స్టేషన్‌నుంచి లింగంపల్లికి బయలుదేరుతుంది. లింగంపల్లి-కాకినాడటౌన్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 7 నుంచి 31వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ రైలు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో లింగంపల్లిలో బయలుదేరి కాకినాడ టౌన్‌కు చేరుతుంది. ఈ రెండు రైళ్లూ రాజమండ్రి, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ మీదుగా విజయవాడకు చేరనున్నాయి. రైల్వేస్టేషన్‌ల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో శ్రీధర్ తెలిపారు.

డ్వాక్రా పుస్తకాల తనిఖీ పారదర్శకంగా జరగాలి

» డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి » డివిజన్‌లోని యూఎన్‌బీ సీఆర్పీలకు శిక్షణ


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

రాజానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన పుస్తకాల తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి చెప్పారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి (2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు) పుస్తకాల నిర్వహణ, తనిఖీలపై రాజానగరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు సంబంధించిన 74 మంది యూఎన్‌బీ సీఆర్పీలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఉండేలా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునే దిశగా మహిళలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డీపీఎం (ఫైనాన్స్) సంపత్‌కుమార్, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, లీగల్ కోఆర్డినేటర్లు, స్వర్ణలత, తిలక్, సింహాచలం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, కడియం, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ మండలాలకు చెందిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

47వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక 47వ డివిజన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూహెచ్‌సీలో లోటుపాట్లను పరిశీలించి.. రికార్డులను తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ నమోదు వల్ల కొంత జాప్యం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ల పనితీరు ఒకేలా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అలవాటుపడిన నిర్లక్ష్యం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాన్‌రెసిడెన్షియల్‌లో శిక్షణ ఇవ్వాలి



దివాన్‌చెరువు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల శిక్షణను నాన్ రెసిడెన్షియల్ విధానంలో జరిపించాలని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు గురువారం ప్రభుత్వాన్ని కోరారు. విజయనగరం జిల్లాలో జరుగుతున్న లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో అకాలమరణం చెందిన ఉపాధ్యాయుడికి కొండగుంటూరులో ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. రెండో బ్యాచ్‌లో లీడర్‌షిప్ శిక్షణ పొందుతూ ఒక ఉపాధ్యాయుడు మరణించినపుడు.. ఏ జిల్లాకు ఆ జిల్లాలో శిక్షణ ఇస్తామని చెప్పి 3వ బ్యాచ్ శిక్షణను యథావిధిగా రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్నారన్నారు. మరలా ఈరోజు లీడర్‌షిప్ శిక్షణలో మరో ఉపాధ్యాయుడు మృతిచెందడం బాధాకరమన్నారు. ఇకనుంచైనా ఈ శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరపాలని కోరారు. ఈ మేరకు వారు కాకినాడ జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.


ముఖ్యమంత్రి చంద్రబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలువురి పరామర్శ

అనపర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు దశదిన కర్మ కార్యక్రమానికి గురువారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. నారా వారి పల్లెలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, రామ్మూర్తి తనయుడు రోహిత్‌లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి వెంట ఎమ్మెల్యేలు వేగుళ్ళ జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తదితరులున్నారు.

వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవికి వరసాల రాజీనామా


రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రసాద్

గోకవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. కేఎస్‌పీపీ లే అవుట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా తాను వైసీపీలో కొనసాగుతున్నానన్నారు. ప్రస్తుతం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన సంస్థకు ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం వల్ల వైసీపీకి న్యాయం చేయలేక గుడ్ బై చెబుతున్నా మ న్నారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆకర్షితుడినై ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు నిర్ణయం తీసుకు న్నామన్నారు. రామసేన అధ్యక్షుడు శ్రీనివాస రావు బీజేపీలో చేరితే తాను కూడా తన అనుచరులతో వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తన రాజీనామా లేఖను వైసీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, వరసాల ప్రసాద్‌లకు అందజేశామన్నారు.

ఆపదలో వున్న వారిని ఆదుకునేందుకే జనసేన


జాహ్నవిశ్రీ కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆపదలో వున్న వారిని ఆదుకునేందుకే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జనసేనను స్థాపించారని పిఠాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. బిక్కవోలులో ఇటీవల దీపావళి రోజున జనసేన కార్యకర్త వాసంశెట్టి వీరబాబు కుమార్తె జాహ్నవిశ్రీ బాణసంచా కాలుస్తూ తీవ్ర గాయాలకు గురైంది. దీంతో మండలంలోని జనసైనికులు సమకూర్చిన రూ.1,23,000 చెక్కును ఆయన గురువారం జాహ్నవిశ్రీ తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో జనసేన నేతలు రావాడ నాగు, ఇ.వీరబాబు, తోట సురేష్, గుత్తుల శివకొండబాబు, అరుణ్‌కుమార్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణునిపాలెంలో
భారీ అన్నసమారాధన

గోకవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణునిపాలెంలో శ్రీ పార్వతి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన జరిగింది. దాతలు, స్థానికుల విరాళాలతో నిర్వహించిన ఈ అన్నసమారాధనలో సుమారు 20 రకాల వంటకాలను భక్తులకు ప్రసాదంగా అందించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చాలి

» పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి
» ఎంఈవోలు, హెచ్‌ఎంలకు నాయకత్వ శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

రాజానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చదువుకోకుండా బడి బయట ఉన్న పిల్లలందరినీ విధిగా పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ)నాగమణి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు మండలంలో మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న నాయకత్వ శిక్షణా తరగతులకు శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు క్రమ శిక్షణతో పాఠశాలలను అభివృద్ధి పథంలో నడపాలని, పాఠశాల భద్రత, విద్యార్థి భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు నిరంతరం పాఠశాలను పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలోని మౌలిక వసతులు, మానవ వనరులు, ఆర్థిక నిర్వహణపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే ఆన్‌లైన్ డేటాకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని నిర్దిష్ట వ్యవధిలో డేటా సంబంధిత పనులను పూర్తి చేయాలని వివరించారు. పిల్లలందరికీ అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా, పిల్లలు ఎవరూ బడి బయట లేకుండా ఉండేలా నూరుశాతం గ్రాస్ ఎడ్యుకేషన్ రేషియో(జీఈఆర్) సాధించేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా నాయకత్వ లక్షణాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరీ శంకర్రావు, కోనసీమ జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, రాజానగరం మండల విద్యాశాఖాధికారి జ్యోతిప్రసాద్, తొమ్మిది మంది మాస్టర్ ఫెసిలిటేటర్‌లు, 190 మంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

గోకవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినికి ఓ ఉపాధ్యాయురాలు ఉచితంగా సైకిల్ బహూకరించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జి.శ్రీదేవికి హిందీ ఉపాధ్యాయురాలు పి.అన్నపూర్ణ సైకిల్‌ను ఉచితంగా అందజేసారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సారపు ఈశ్వరిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై
అవగాహన అవసరం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే సూచించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయంతో గురువారం మధుమేహ వ్యాధిపై వర్క్‌షాపు నిర్వహించారు. శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తూ మొదటిగా డయాబెటిస్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అభిరామ్ డయాబెటిస్ ఆసుపత్రి డాక్టర్ ఎం.శేఖర్ రెడ్డి మధుమేహ వ్యాధి ఎందుకు వస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర కుటుంబాలకు మధుమేహం, సీబీసీ, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు.కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి బాబు, డాక్టర్ జే.సురేష్, యూత్ రెడ్‌క్రాస్ రవితేజ, ఎం.విజయశాంతి, జంతుశాస్త్ర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

3 వేల లీటర్ల
బెల్లపుఊట ధ్వంసం

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డ్రోన్ సహాయంతో పరిశీలించి సారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. గోంగూర లంక, వెంకటనగరం, పిచ్చుక లంక, బొబ్బిల్లంకల్లో 1800 లీటర్ల బెల్లపుఊట, 150 కిలోల నల్లబెల్లం, దేవరపల్లి స్టేషను పరిధిలో 1200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.


కొంకుదురు హైస్కూల్లో పూలేకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూలేకు ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు పనిచేయడమే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి ని పురస్కరించుకుని పూలే సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం గోదావరి గట్టున పూలే విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. పూలే, అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అత్యంత సుందరంగా నగరవాసులకు అందిస్తామన్నారు. స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తొలి పూలే విగ్రహ నిర్మాణానికి కృషిచేసిన వారందరూ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు,సెంట్రల్ జైల్ వైద్యాధికారి పి.కోమల,డాక్టర్ అనసూరి పద్మలత తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన, బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బిక్కవోలు వంతెన వద్ద వున్న పూలే విగ్రహానికి ఎంపీపీ బుద్దాల కన్నారావు పూలమాలతో నివాళులర్పించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తో సాధ్యం

దైవ సేవకులతో సదస్సులో జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని మతాలు, కులాల సంక్షేమం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టికే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం కృష్ణసాయి కల్యాణ మండపంలో గురువారం జరిగిన దైవ సేవకులు సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే క్రైస్తవుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. డిసెంబరు నెలలో రాజమహేంద్రవరంలో నిర్వహించే క్రిస్మస్‌కు షర్మిళారెడ్డి అనిల్ దంపతులు విచ్చేస్తారని చెప్పారు. సదస్సులో గోదావరి జిల్లాల పాస్టర్స్ వైస్ ప్రెసిడెంట్ బి.నవీన్ కుమార్, రీజనల్ చైర్మన్ కె.జోసెఫ్, కె.మధు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శారద, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండరాజు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల దారిలో
నేడు ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల మైదానంలో శివపార్వతుల కల్యాణం కార్యక్రమం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ వరకూ ఎలాంటి వాహనాలకూ అనుమతి ఉండదన్నారు. విశాఖ వెళ్లే బస్సులు ఇతర వాహనాలు, కంబాల చెరువు నుంచి లాలాచెరువు వెళ్లేవి క్వారీ మార్కెట్ సెంటర్, లాలాచెరువు గుండా వెళ్లాలి. కార్యక్రమానికి వెళ్లే వారు తమ వాహనాలను జడ్జి బంగ్లా దారిలో వెళ్లి ఆర్ట్స్ కళాశాల వెనుక వైపున పార్కింగ్ చేసుకోవాలన్నారు. కాలినడకన వచ్చే వారు మెయిన్‌గేటు, రెండోగేటు గుండా లోనికి ప్రవేశించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

రామ్మూర్తినాయుడు సంస్మరణార్థం
అన్నదానం


అన్నదానం చేస్తున్న రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ (రాజమహేంద్రవరం) వ్యవస్థాపకుడు నారా రామ్మూర్తినాయుడు సంస్మరణార్థం సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తిరుపతిలో అన్నదానం చేశారు. తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి సెంటర్‌లో గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ ఆర్‌ఎంవో డాక్టర్ ఆర్‌ఆర్.రెడ్డి, స్వర్ణాంధ్ర సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో నారా రామ్మూర్తినాయుడు మిత్రబృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో సుధాకర్, రాయవరపు రామారెడ్డి, పి.హరి ప్రసాద్, బాల, వెంకటముని పాల్గొన్నారు.

అలాగే రాజమహేంద్రవరంలో స్వర్ణాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో నారా రామ్మూర్తినాయుడు సంస్మరణార్థం వేయి మందికి అన్నదానం చేశారు. లాలాచెరువు స్వర్ణాంధ్రలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి తొలుత రాంబాబు నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆశ్రమంలోను, పుష్కరాల రేవు వెలుపుల అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనూప్ గుప్త, హరికృష్ణ, హరిప్రసాద్, కొండలరావు, మీరా కుమారి, దివ్యకుమారి, శేఖర్ తదితరుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానవరం ఇండస్ట్రియల్ ఫీడర్ వార్షిక మరమ్మతు పనుల్లో భాగంగా నేటి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రభావంతో 33/11 కేవీ కానవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే చక్రద్వారబంధం, రాధేయపాలెం, రాఖీ ఎవెన్యూస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని రాజానగరం ఏఈ వీఎస్ సుధాకర్ కోరారు.

అనపర్తి: దుప్పలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. శుక్రవారం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీబీఆర్ కాలేజీ ఏరియా, ఇందిరానగర్, సునందపేట, మార్కెండేయపురం, మార్కెట్, శేషగిరిరావు పేట, వెంకటరత్నపురం, మెయిన్ రోడ్డు, కెనాల్ రోడ్డు, కొప్పవరం, ఎల్ఎన్‌పురం, దుప్పలపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు.

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరు సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ టౌన్‌ఫీడర్, 11 కేవీ వడిశలేరు రూరల్, 11 కేవీ ఎస్టీరాజాపురం ఫీడర్‌నకు ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు, చెట్టు కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు 33/11 కెవి విద్యుత్ సరఫరాను నిలుపుదల జరుగుతుందని రాజమహేంద్రవరం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో వడిశలేరు, ముకుందవరం, ఎస్టీరాజాపురం, వెంకన్నపేట, గోవిందరాజపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ
వృద్ధురాలి మృతి

అనపర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన వీధి సత్యవతి(86) గురువారం చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. కుతుకులూరు గ్రామానికి చెందిన సత్యవతి బుధవారంనాడు ఇంటిలో జారి పడటంతో తల వెనుక గాయమైంది. దీనితో బంధువులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

కోరుకొండ కొండకు దీపోత్సవం


పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపోత్సవం కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి దంపతులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, టీడీపీ రైతు విభాగం ఉపాధ్యక్షులు అడపా వీరబాబు, శ్రీరంగపట్నం మాజీ సర్పంచ్ తనకాల వెంకట్రావు, తనకాల బాబు, జనసేన నాయకులు అడపా శ్రీనివాస్ గురువారం జరిగిన కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ దంపతులు కార్తీక దీపాలు వెలిగించి దీపోత్స వాన్ని ప్రారంభించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో దాతలు ముందుకు వచ్చి కార్తీక మాసం నెలరోజులు ఎంత మంది భక్తులు వచ్చినా అన్న సమారాధన నిర్వహిస్తామని అన్నదాన సేవా కమిటీ అధ్యక్షుడు తనకాల నాగేశ్వరరావు, బొడ్డు వెంకటరమణ చౌదరి తెలి పారు. మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రి స్వామి వారి ఆలయ ప్రాంగణం, కొండ మెట్లకు దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకస్వాములు వాడపల్లి నాగు ఆచార్యులు, బొడ్డు వెంకటరమణ చౌదరి దంపతులు, తనకాల నాగేశ్వరరావు దంపతులు అడపా వీరబాబు దంపతులతో కార్తీక దీపోత్సవం పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

జీజీయూను సందర్శించిన ఐఐటీటీ నిఫ్ ప్రాజెక్టు డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జీజీయూ వీసీ చంద్రశేఖర్

రాజానగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీని ఐఐటీటీ నిఫ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవత్సవ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జీజీయూ వీసీ యు. చంద్రశేఖర్ మాట్లాడుతూ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(జీఐఎస్), కృత్రిమ మేధస్సు (ఎ1) రంగాల్లో విద్యార్థులకు ఆధునిక జ్ఞానాన్ని అందించడంలో విశ్వవిద్యాలయ దృష్టిని పునరుద్ఘాటించారు. అంతర విభాగ పరిశోధనలు, ప్రాముఖ్యత, ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో సామర్థ్యాన్ని తెలిపారు. ఉపగ్రహ చిత్రీకరణలో అంతర విభాగ విద్యార్థుల ప్రాజెక్టులను ప్రోత్సహించడం, సాంకేతికత, స్థిరత్వానికి మధ్య అనుసంధాన పరిశోధనలను ప్రోత్సహిం చడం, జీవ సమాఖ్య శాస్త్రం, మెషిన్ లెర్నింగ్, డీప్ లె ర్నింగ్ వంటి వివిధ రంగాల నుంచి ఫ్యాకల్టీ సభ్యులు చర్చలు జరిపారు. కార్యక్రమంలో కె.వెం కట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐపీపీబీ ఖాతాలకు పోస్టాఫీసుల వద్ద మహిళల క్యూ


అనపర్తి పోస్టాఫీసు వద్ద మహిళలు

అనపర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తప్పనిసరిగా పొదుపు ఖాతాలు ఉండాలన్న ప్రభుత్వ ప్రకటనతో ఐపీపీబీ ఖాతాలను తెరిచేందుకు పోస్టాఫీసుల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. బ్యాంకు అకౌంట్ లేదా పోస్టాఫీసులో ఐపీపీబీ అకౌంట్లు ఉండాలని ప్రకటించడంతో మహిళలు పోస్టాఫీసుల వద్ద క్యూ కడుతున్నారు. గురువారం అనపర్తి పోస్టాఫీసు వద్ద మహిళలు బారులు తీరడంతో సిబ్బంది ఖాతాలు తెరిచేందుకు పలు అవస్థలు ఎదుర్కొన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ కాని వారు ఐపీపీబీ ఖాతాలను తెరుస్తున్నారు. పోస్టుమాస్టర్ సుమంత్ మాట్లాడుతూ వారం రోజులుగా రోజుకు సుమారు 100 ఖాతాలు తెరుస్తున్నామని రెండు రోజులుగా మరింత తాకిడి పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్.తరుణ్, ఎమ్.సతీష్‌కుమార్ తదితరులు సేవలందించారు.

4కిలోల గంజాయి స్వాధీనం

గోకవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలకు చెందిన మోటుకూరి తిరుపతిరావు అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అతనిపై నిఘా పెట్టామన్నారు. గోకవరం గ్రామ శివారున ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద తిరుపతిరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 4 కిలోల గంజాయితోపాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని
వ్యక్తికి తీవ్రగాయాలు

కడియం నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిలంక గ్రామం వద్ద గురువారం సాయంత్రం రోడ్డు దాటుతున్న బి.త్రిమూర్తులును గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతడి తలకు తీవ్రగాయమైంది. వైద్యం నిమిత్తం స్థానికులు 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రమేష్‌ను కోర్టులో హాజరుపర్చాలి

కడియం నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శి పూనెం బాబు అలియాస్ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారని అతన్ని తక్షణమే కోర్టులో హాజరుపరచాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అజ్ఞాతదళ కమాండర్ పూనెం బాబును గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశా రని అతనికి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

నవమాసాలు మోసింది.. పుట్టిన రోజే అమ్మేసింది!
అడ్డుకున్న జంగారెడ్డిగూడెం పోలీసులు 7
ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో నేడు ట్రాఫిక్ మళ్లింపు 8



మాస్టారు కాదండోయ్..

ఈయనెవరో గుర్తుపట్టారా.. ఎవరా అని తలలుపట్టుకుంటున్నారా..మన మాస్టార్లు గుర్తుపడతారు కానీ.. సాధారణ ప్రజానీకానికి తెలియదు..ఎందుకంటే ఆయన మన జిల్లా విద్యాశాఖాధికారి..మరి ఇదేంటి పాఠాలు చెబుతున్నారంటారా.. తరగతి కనబడితే ఇప్పుడు డీఈవో అయినా ఒకనాడు మాస్టారే కదా.. అందుకే కడియం మండలం దుళ్ల ఉన్నత పాఠశాలలో గురువారం ఇలా మాస్టారిగా మారిపోయారు..పదవ తరగతి విద్యార్థులకు హితబోధ చేశారు.ఇంకా మీకు నాలుగు నెలలే సమయం ఉంది.. బాగా కష్టపడి చదవండి.. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలి.. సీ,డీ గ్రేడు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని,నూరుశాతం ఫలితాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. - కడియం



పట్టుదల.. పవర్ లిఫ్టింగ్

ఇతన్నెక్కడో చూసినట్టు ఉందే.. అనుకుంటున్నారా..రాజమహేంద్రవరం ప్రజలకు కాస్త సుపరిచితుడే.క్రీడాకారుడిగా కాదండోయ్.. పారిశుధ్య కార్మికుడిగా..మరి ఇదేంటి అంటారా.. అదే మరి పట్టుదల ఉంటే కానిదిలేదు..తపన ఉంటే సాధించలేనిదిలేదనడానికి ఇతనే నిదర్శనం.. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న అర్జి బాల కృష్ణకు చిన్నతనం నుంచి పవర్ లిఫ్టింగ్ అంటే ఇష్టం..అయితే రెక్కాడితే కానీ డొక్కాడని జీవితం..దీంతో రాజమహేంద్రవరం పారిశుధ్య విభాగంలో 2014 నుంచి పనిచేస్తున్నాడు. ఇటు ఉద్యోగం చేసుకుంటూఅటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు చెన్నై సేలంలో జరిగిన సౌతిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. 74 కేజీల విభాగంలో 10 మంది క్రీడాకారులకు పోటీ ఇచ్చి విజేతగా నిలిచాడు. - రాజమహేంద్రవరం సిటీ



కలెక్టర్..డాక్టర్!

డాక్టర్లు, ఏఎన్ఎంలకు కలెక్టర్ క్లాస్ తీసుకున్నారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు.. ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చారని ప్రశ్నించారు.. సమస్యలు తెలుసుకుని మందులు పరిశీలించారు. ఏఎన్ఎంలు పీహెచ్‌సీలో ఎందుకు ఉన్నారని నిలదీశారు.గర్భిణులకునార్మల్ డెలివరీ అయ్యేందుకు సూచనలు,సలహాలు ఇవ్వడం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కొందరు ఆశావర్కర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలుప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం సిఫారసు చేస్తున్నట్టు తమదృష్టికి వచ్చిందని కలెక్టర్ అన్నారు. వైద్యాధికారి డాక్టర్ వి.కోటేశ్వరరావు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు వివరించారు. ఆసుపత్రిలో బెడ్‌లు పరిశీలించారు. - కోరుకొండ



గోదారి.. మారుతుందోచ్!

ఇదో చరిత్ర : రాజమహేంద్రవరంలో గోదావరిపై ఉన్న 127 సంవత్సరాల హేవలాక్ బ్రిడ్జి

అఖండ గోదావరికి పర్యాటక కళ

- పర్యాటక నిధుల ప్రవాహం
- తొలి విడతగా రూ.62 కోట్లు
- మారనున్న హేవలాక్ వంతెన
- ఇక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కరఘాట్
- కడియం నర్సరీలకు శోభ
- విజ్జేశ్వరం కాలువలో బోట్ షికార్
- త్వరలో టెండర్లు ఆహ్వానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరికి పర్యాటక కళ రానుంది. వచ్చే పుష్కరాలకు హేవలాక్ బ్రిడ్జి, పుష్కర ఘాట్, కడియం నర్సరీలు, విజ్జేశ్వరం-నిడదవోలు కాల్వ, కోటసత్తెమ్మ గుడి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందనున్నాయి. అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు మంజూరుకాగా అందులో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) పథకం కింద రూ.62 కోట్లు విడుదలచేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషితో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.


హేవలాక్ ఇలా...

హేవలాక్ బ్రిడ్జి

రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరిపై నిర్మించిన మొదట రైల్వే బ్రిడ్జిని మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. 127 ఏళ్ల ఈ బ్రిడ్జిని చారిత్రక కట్టడంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. ఈ మేరకు రెండు దశాబ్దాల కిందట అప్పట్లో సీఎం చంద్రబాబు చొరవతో రైల్వేశాఖకు రూ.10 కోట్లు చెల్లించి బ్రిడ్జిని స్వాధీనం చేసుకున్నారు. గత పుష్కరాల సమయంలో అప్పటి సీఎంగా చంద్రబాబు అఖండగోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జి, గోదావరి లంకలు, ఘాట్లు అభివృద్ధి చేయాలని ప్రయత్నించారు. రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి రీజనల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తేసింది. పర్యాటక కళలను ధ్వంసం చేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అఖండ గోదావరికి మళ్లీ జీవంపోసింది. 2,700 మీటర్ల పొడవుతో 18 స్పాన్స్‌తో ఉన్న హేవలాక్ బ్రిడ్జిని సాసి పథకం కింద మల్టీఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. థీమేటిక్, బఫర్ జోన్లుగా విభజించారు. థీమేటిక్ జోన్‌లో వాటర్‌ఫాల్, గ్లాస్ బ్రిడ్జిలు, ఎస్సెన్స్ థీమ్డ్ జన్, అర్బన్‌హాట్, అక్వేరియం టన్నెల్స్ ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. బఫర్‌జోన్‌లో గోదావరిని వ్యూ పాయింట్ నుంచి చూసేలా అభివృద్ధి చేస్తారు.


కడియం దారిలో

కడియంలో కన్వెన్షన్ సెంటర్..

ఇప్పటికే ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న కడియం నర్సరీలకు మరింత పర్యాటక శోభ రానుంది. కడియపులంకలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. నర్సరీలలో ఒక నర్సరీ నుంచి మరో నర్సరీకి వెళ్లి తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పొట్టిలంక, కడియపులంక, వేమగిరి మధ్య బోట్ షికారు ఏర్పాటుచేసి, నర్సరీలు సందర్శించేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లను ధవళేశ్వరానికి చెందిన ఆర్కిటెక్ట్ భమిడిపాటి కిరణ్ రూపొందించారు.


సమిశ్రగూడెం కాలువలో..

నిడదవోలు కోటసత్తెమ్మ గుడికి మరింత ప్రాధాన్యత సంతరించేలా ఇక్కడ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు. నిడదవోలు ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ఇక్కడ ప్రతిపాదన చేయడంతోపాటు నిధులు మంజూరు చేయించారు. విజ్జేశ్వరం నుంచి నిడదవోలు గుండా వెళ్లే ప్రధాన పంట కాలువలో సమిశ్రగూడెం వద్ద కాలువలో బోటు షికారు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ రెస్టారెంట్ సిద్ధం చేయనున్నారు.


గోదావరి హరివిల్లు.. బోట్ హౌస్

పుష్కర ఘాట్ అభివృద్ధి

ఆధ్యాతిక కేంద్రంగా పుష్కరఘాట్ తీర్చిదిద్దనున్నారు. గోదావరి మాత గుడిని నిర్మించనున్నారు. ఇక్కడ శివపార్వతులు, వినాయక, కార్తికేయ ఆలయాలు నిర్మించనున్నారు. నక్షత్ర స్తంభాలు దివ్యత్వం ఉట్టిపడేటట్టు గోదావరి, ఆస్ట్రాలజికల్ స్టార్స్ నిర్మించనున్నారు. మండపాలు, మెడిటేషన్, స్పిరిట్యువల్, వాణిజ్య సౌకర్యాలు కల్పించనున్నారు.



వచ్చే పుష్కరాలకు రూపురేఖలు మారుస్తాం..



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు పర్యాటక ప్రాజెక్టులకు రూ. 113.751 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అఖండగోదావరికి, గండికోట ప్రాజెక్టుకు కలిపి మొత్తం రూ.177 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే పుష్కరాలకే రూపురేఖలు మారతాయి.

- కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి

గర్భిణులకు ఫోన్‌లోనే వైద్య సేవలు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు


కిల్కారి సేవల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గర్భిణీలు, బాలింతలకు మొబైల్ ఫోన్ల ద్వారా కిల్కారి సేవలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో కిల్కారి సేవలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. కిల్కారి సేవల్లో భాగంగా తల్లి బిడ్డల ఆరోగ్యానికి సంబంధించి అవసరమైన సలహాలు, సూచనలు వారి మొబైల్ ఫోన్లలోనే ప్రతివారం డాక్టర్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణీలు, బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌ఓ వసంత లక్ష్మి, డీసీఎం అర్జున్, కిల్కారి అధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

చలి దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా దగ్గు, జలుబు తదితర శ్వాసకోస సమస్యలు పెరిగే అవకాశం ఉందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది శ్వాసకోస సంబంధిత రోగులను ముందస్తుగా గుర్తించి వారికి ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



నీటి సంఘాలకు.. గ్రీన్‌సిగ్నల్!

ఐదేళ్ల తరువాత అన్నదాతలకు తీపికబురు

- ఫలించిన ఎదురుచూపులు
- వచ్చే నెల 5న నోటిఫికేషన్
- 18న నీటి సంఘాల ఎన్నికలు
- 1997 నుంచి కొనసాగింపు
- గత వైసీపీలో రద్దుకు యత్నం
- కూటమి రాకతో ఎన్నికలు
- జిల్లాలో రైతుల ఆనందం
- గ్రామాల్లో రాజకీయ వేడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రైతాంగం ఎదురుచూపులు ఫలించాయి. నీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో జిల్లా రైతాంగంలో సందడి నెల కొంది. నీటి సంఘాల ఎన్నికల సంబంధించిన వచ్చే నెల 5న నోటిఫికేషన్ జారీ కానుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు,14న ప్రాజెక్టు కమిటీ (పీసీ) ఎన్నికలు జరగనున్నా యి.18న టీసీ సభ్యులు,నీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. నీటి సంఘాలు ఆయకట్టు పరి ధిలోని ఆధునికీకరణ..రైతులకు నీటి సరఫరా తదితర పనులు పర్యవేక్షిస్తాయి..

నాడు చంద్రబాబు అంకురార్పణ

గోదావరి జిల్లాల్లో నీటి సంఘాల ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇవి కూడా రాజకీయ ప్రాబల్యాన్ని కలిగి ఉం టాయి. గ్రామ సర్పంచ్‌లు, ఆయా ప్రాంతాల రాజకీయ పెద్దల నుంచి ఎమ్మెల్యేల వరకూ ఈ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటారు. సీఎం నారా చంద్రబాబునాయుడు 1997లో నీటి సంఘాలకు అంకురార్పణ చేశారు. అప్పటిలో ధవళేశ్వరంలో ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్రస్థాయి సదస్సు పెట్టి.. నీటి సంఘాల ప్రాధాన్యత, వాటి ఎన్నికల గురించి చర్చించారు. అప్పటి వరకూ రైతులకు పెద్ద ప్రాధాన్యత ఉండేది కాదు. గ్రామాల్లో కొందరు పెత్తందార్లు చెప్పినట్టుగా సాగేది. పంటకు కాల్వల ద్వారా నీరు ఇవ్వాలన్నా, కాలువలు, బోదెలు, డ్రెయిన్లు బాగు చేసుకోవాలన్నా ఊరిలో కొందరు పెద్దల ఇష్టానుసారం సాగేది. రైతుల నుంచి డబ్బులు కూడా వసూలు చేసి నొక్కేసేవారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పక్కదారి పట్టించేసేవారు. డెల్టా సిస్టమ్ నిర్వహణ సరిగ్గా ఉండేది కాదు. కానీ చంద్రబాబు ఆలోచన వల్ల నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత ఇరిగేషన్ ద్వారా నీటి సంఘాలకు కొంత డబ్బు కేటాయించి, ఆయా ప్రాంతాల్లోని కాలువలు, బోదెలు, డ్రెయిన్లు క్లీన్ చేయించడం మొదలైంది. కాల్వల తూడు, సిల్ట్ తొలగింపు పనులు చేశారు. నీటి సంఘాల ఏర్పాటుతో గ్రామాల్లో అన్ని రైతు వర్గాల్లోనూ చైతన్యం పెరిగింది.1999లో మొదటి ఎన్నికలు జరగ్గా తర్వాత 2002, 2008, 2015లో జరిగాయి. అందులో 2008లో తప్ప మిగతా మూడు సార్లు చంద్రబాబు సీఎంగా ఉండగానే ఎన్నికలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలే నిర్వహించలేదు. వీటిని రద్దు చేసే యోచన కూడా చేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో నీటి సంఘాలు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి పరిధిలో ఎన్నికలు జరిగేవి. ప్రస్తుతం జిల్లాల విభజన వల్ల ఏ జిల్లా పరిధిలో ఆ జిల్లాకే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కానీ తూర్పు, మధ్య డెల్టాలకు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు కాకినాడ, అమలాపురం పరిధిలో జరగనున్నాయి. పశ్చిమ డెల్టాకు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో జరగనున్నాయి.

జిల్లాలో 113 నీటి సంఘాలు..

తూర్పుగోదావరి జిల్లాలో 113 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుష్కర పంపింగ్ స్కీమ్, తొర్రిగడ్డ ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఎన్నికలు ఉంటాయి. మేజర్ ఇరిగేషన్ పరిధిలో 6నుంచి 12 టీసీ (ప్రాదేశిక కమిటీ)లు ఉంటాయి. మొదట టీసీలను రైతులు ఎన్నుకుంటారు. టీసీ సభ్యులు నీటి సంఘాల ప్రెసిడెంట్ , ఇతర కమిటీని ఎన్నుకుంటారు.వీరు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు.ఈ కమిటీలు జిల్లా స్థాయిలో ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని పనులు చేస్తారు. జిల్లాలో 18 మండలాలు ఉన్నప్పటికీ, కొవ్వూరు, రాజమహేంద్రవరం అర్బన్, తాళ్లపూడి ,చాగల్లు మండలాల్లో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఆయకట్టు లేదు. అందువల్ల అక్కడ ఎన్నికలు నిర్వహించడంలేదు. ఇక ప్రాజెక్టు కమిటీ,డీసీ సభ్యుల ఎన్నికకు రాజకీయ ప్రాధాన్యత ఉంటుంది. నీటి సంఘాల చైర్మన్ల ఎన్నికపై గ్రామాల్లో రసవత్తరంగా ఉంటుంది.


పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జేసీ

జ్యోతి రావు పూలేకు ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావుపూలే అని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన పూలే వర్థంతి కార్యక్రమంలో జేసీ పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ . జ్యోతి, బీసీ సంక్షేమ అధికారి సత్యరమేష్, అధికారులు పూలమాలలు వేశారు. గోదావరి బండ్ రోడ్డులోని జ్యోతి రావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పూలమాలలు వేశారు.

డిసెంబరు 1 నుంచి రబీ నీటి విడుదల


సాగునీటి సలహా మండలి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సాగు కోసం డెల్టా కాలువలకు డిసెంబర్ 1 నుంచి ధవళేశ్వరం బ్యారేజి నుంచి నీటిని విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024- 25 రబీ సీజన్‌లో తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల పరిధిలో 8,96,507 ఎకరాల ఆయకట్టుకు సాగు, మంచినీటి అవ సరాలకు నీటిని అందిస్తామని తెలిపారు. తూర్పు డెల్టాకు 2,64,507 ఎకరాలు, పశ్చిమ డెల్టాకు 4, 60,000 ఎకరాలు, సెంట్రల్ డెల్టా(కోనసీమ)కు 1, 72,00 ఎకరాల ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. ప్రస్తుతం గోదావరి నదిలో 91.35 టీఎంసీల నీరు ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లా రబీ ఆయకట్టుకు గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు సంబంధించి 27,001 ఎకరాలకు, గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు సంబంధించి 35,710 ఎకరాలు, తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం ద్వారా కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 1650 ఎకరాలకు, కలిపి మొత్తం 64,361 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. ఎర్రకాలువ, కొవ్వాడ కాల్వల కిందట గోపాలపురం, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని ఆయకట్టు వరదలు, భారీ వర్షాల కారణంగా ప్రతి ఏటా అనేక వేల ఎకరాల ఆయకట్టు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల కాల్వల ఆధునీకరణ పను లు చేపట్టి, గండ్లు పూడ్చి వేసి, ఏటిగట్లు పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎర్రకాలువ, కొవ్వాడ, చింతలపూడి, తొర్రిగడ్డ, సీతానగరం ప్రాజెక్టుల ఈఈలు ఆయా ప్రాజెక్టుల పరిధిలో సీజన్‌వారీగా సాగు విస్తీర్ణం, ఆయకట్టు సాగు అంశాలకు సంబంధించిన వివరాలు నివేదిక రూపంలో వివరించారు. పురుషోత్తపట్నం, చింతలపూడి, పట్టిసీమ, వెంకటనగర్ ఎత్తిపోతల పథకాల పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.చి న్నరాముడు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, జిల్లా నీటిపారుదల అధికారి జి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్,రాణి సుష్మిత,జిల్లా వ్యవ సాయాధికారి ఎస్.మాధవ రావు, ఎంసీ కెనాల్ ఎస్ఈ ఏసుబాబు, ఏలూరు ఎస్ఈ దేవ ప్రకాష్,ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బి.వెంకటగిరి, వ్యవసాయ శాఖ ఏడీలు పాల్గొన్నారు.


నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతికి సమస్యలు విన్నవిస్తున్న ఇరిగేషన్ అధికారులు..చిత్రంలో ఆర్‌డీవోలు కృష్ణనాయక్, రాణి సుష్మిత, ఇతర అధికారులు

కొవ్వూరు

తాగునీరు వృథా



ప్రక్కిలంకలో ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది నిర్లక్ష్యంతో పొర్లిన శుద్ధి జలాలు

తాళ్లపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర మంచినీటి పథకంలో పనిచేసే సిబ్బంది గురువారం వాటర్ ప్లాంట్‌ను గాలికి వదిలి వెళ్లిపోయారు. అక్కడ శుద్ధిచేసిన జలాల ట్యాంకు నిండిపోడంతో వేలాది లీటర్ల తాగు నీరు పొంగి పొర్లి వ్యర్థమైంది. మంచినీరు పట్టుకోవడానికి వచ్చిన స్థానికులు ఇంత నిర్లక్ష్యంగా ప్లాంటును వదిలి వెళ్లిపోయిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా తుంటరి లోపలికి వెళ్లి ఆ ట్యాంకులో ఏదైనా కలిపితే ప్రజల ఆరోగ్య పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి సరైన సిబ్బందిని ఏర్పాటు చేసి వాటరు ప్లాంటును, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న శుద్ధి జేసిన జలాలు

పశువుల్లో సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!

జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు



కుమారదేవంలో ఉచిత పశు వైద్య శిబిరం

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. కుమారదేవం గ్రామీణ పశు వైద్యశాల వద్ద పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 95 పశువులకు చికిత్స, 40 లేగదూడలకు నట్టల నివారణ, 110 పశువులకు బాహ్య పరాన్న జీవుల (గోమార్ల) నిర్మూలనకు డే టికింగ్ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు డీడీ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, తాడేపల్లిగూడెం డీఎల్‌డీపీ ఈవో డాక్టర్ జేసురత్నం, ఏడీ ఎ.వెంకటరెడ్డి, పశు వైద్యశాల డాక్టర్లు బి.గిరీష, యు.ముఖేష్, బాలాజీశంకర్, సోమశేఖర్, మోహనరావు, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ డి.రమణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి..చేసేదొకటి

మాజీ ఎమ్మెల్యే తలారి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి, చేసేదొకటని వైసీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత ఇసుక పేరుతో నాయకులు దోచుకుంటున్నారన్నారు. సూపర్‌సిక్స్ 6 అమలు కావడం లేదని, ఎంతసేపు వైఎస్ జగన్‌పై బురదచల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనప్పటికీ తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంటు అందించలేదన్నారు. ఇష్టానుసారం బిల్లులు పెట్టుకుని అసెంబ్లీ నిర్వహించారన్నారు. జగన్ 15 మెడికల్ కాలేజీలు పెడితే, 5 ప్రారంభమయ్యాయని, మరో 5 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు జగన్‌తోనే సస్యశ్యామలం అవుతుందని తలారి అన్నారు.

జ్యోతిరావు పూలే వర్ధంతి

ఇదిలా ఉండగా కార్యాలయంలో సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తలారి వెంకట్రావు, వైసీపీ నాయకులు పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం పూలే అహర్నిశలు కృషి చేశారన్నారు. బాలికా విద్య కోసం దేశంలో తొలిసారిగా పాఠశాలలు స్థాపించారని, బాల్య వివాహాలను వ్యతిరేకించారని, వితంతు వివాహాలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో దేవగుప్తాపు లక్ష్మణరావు, గంధ్రోతు సురేంద్ర, చెల్లింకుల మల్లేశ్వరరావు, గంధం సాయి, బోడపాటి హనుమంతరావు, మద్దిపట్ల సాయిగీత పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

తాళ్లపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్లుగా పని చేసిన తమను విధుల్లోకి తీసుకోవాలని మండలంలోని వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయంలోని సూరింటెండెంట్ నిర్మలకుమారికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు ప్రతి నెలా రూ.10 వేల గౌరవ వేతనంతో తిరిగి తమను విధుల్లోకి తీసుకొనే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రస్తుత పరిస్థి తుల్లో నిరుద్యోగ సమస్య తలెత్త కుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్ల కుటుంబాల ఆర్థిక సమస్యలను పరిగణలోకి తీసుకుని తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు భవాని, కృష్ణకుమారి, అయ్యప్ప, పద్మ, జయ దుర్గ, స్వర్ణకుమారి, అనూష పాల్గొన్నారు.

మహిళా విద్యకు పూలే ఎనలేని కృషి

వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిడదవోలు కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా విద్యకు ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ కారింకి వెంకటేశ్వరరావు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం నిడదవోలులోని కోర్టు సెంటరులో ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని కులవివక్ష నిర్మూలనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మేడవరపు భద్రందొర, చిన్నం మురళీకృష్ణ, షేక్ జిలానీ, మహ్మద్ అన్వర్ ఖాన్, షేక్ ఖాసీమ్ పాల్గొన్నారు.

రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

47వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక 47వ డివిజన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూహెచ్‌సీలో లోటుపాట్లను పరిశీలించి.. రికార్డులను తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.ఆన్‌లైన్ నమోదు వల్ల కొంత జాప్యం జరుగుతుందన్నారు.రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ల పనితీరు ఒకేలా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అలవాటుపడిన నిర్లక్ష్యం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మధుమేహ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే సూచించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయంతో గురువారం మధుమేహంపై వర్కుషాపు నిర్వహించారు. శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తూ డయాబెటిస్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చాలి

» పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి
» ఎంఈవోలు, హెచ్‌ఎంలకు నాయకత్వ శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

రాజానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చదువుకోకుండా బడి బయట ఉన్న పిల్లలందరినీ విధిగా పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ)నాగమణి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు మండలంలో మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న నాయకత్వ శిక్షణా తరగతులకు శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు క్రమ శిక్షణతో పాఠశాలలను అభివృద్ధి పథంలో నడపాలని, పాఠశాల భద్రత, విద్యార్థి భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు నిరంతరం పాఠశాలను పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలోని మౌలిక వసతులు, మానవ వనరులు, ఆర్థిక నిర్వహణపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే ఆన్‌లైన్ డేటాకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని నిర్ణీత వ్యవధిలో డేటా సంబంధిత పనులను పూర్తి చేయాలని వివరించారు. పిల్లలందరికీ అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా, పిల్లలు ఎవరూ బడి బయట లేకుండా ఉండేలా నూరుశాతం గ్రాస్ ఎడ్యుకేషన్ రేషియో(జీఈఆర్) సాధించేలా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా నాయకత్వ లక్షణాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరీ శంకర్రావు, కోనసీమ జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, రాజానగరం మండల విద్యాశాఖాధికారి జ్యోతిప్రసాద్, తొమ్మిది మంది మాస్టర్ ఫెసిలిటేటర్‌లు, 190 మంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందుగానే

పింఛన్ల పంపిణీ

గోపాలపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1వ తేదీన పంపిణీ చేయవలసిన సామాజిక భద్రతా పింఛన్లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో వీఎస్ఎస్ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా శనివారం పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. మండలంలో 9,063 మందికి రూ.3,84,17,000 పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అందుబాటులో లేని పింఛన్‌దారులు మూడు నెలలకు ఒకసారి తీసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. పింఛన్‌దారులు ఏ ప్రదేశంలో ఉన్నా మూడునెలలకు ఒకసారి పింఛన్ తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



ఊనగట్లలో టీడీపీ సభ్యత్వ నమోదు దృశ్యం

చాగల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఊనగట్లలో పార్టీ నాయకుడు బొల్లిన శివనాగేంద్ర ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సభ్యత్వాలు నమోదు చేశారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని, అందరూ పార్టీలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పెనుమర్తి కిషోర్, మనెల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మరింత మేలు జరగాలి: జయరాజు

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మరింత మేలు చేసే విధంగా ప్రభుత్వ విద్యా విధానాన్ని అమలు చేయాలని టీడీపీ కొవ్వూరు క్లస్టర్ ఇంచార్జి పెనుమాక జయరాజు అన్నారు. బాలలకు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగించేందుకు ప్రవేశికను ప్రతిరోజు పాఠశాలల్లో ప్రార్థన సమయంలో చదివించాలని, ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు.

శేషగిరిరావు కుటుంబానికి అచ్చిబాబు పరామర్శ



తాళ్లపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బల్లిపాడులో టీడీపీ సీనియర్ నాయకుడు వల్లభని శేషగిరిరావు కుటుంబాన్ని పార్టీ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు గురువారం పరామర్శించారు. శేషగిరిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణ, ఉప్పులూరి రమేష్, దుగ్గిరాల జగదీష్, మద్దుకూరి శంకరం, కాకర్ల శ్రీనివాసు, సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కుమారదేవం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎన్.నారాయణ అప్పారావు అన్నారు. ఆరికిరేవుల, కుమారదేవం, పెనకనమెట్ట గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. అలాగే కొవ్వూరులో 11 కేవీ ఫీడర్ పరిధిలో రాజీవ్ కాలనీ, స్పెక్ వద్ద జగన్నకాలనీకి ఉదయం 8గంటల మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ డి.జగదీశ్వరరావు తెలిపారు.

నిడదవోలు: నిడదవోలులోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని ఎఫ్‌సీఐ గొడౌన్ నుంచి ఎస్వీ ఆర్కే డిగ్రీ కళాశాల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



నిడదవోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని గణేష్‌చౌక్ సెంటరు సమీపంలో గురువారం ఉదయం యాక్టివాను బైక్ ఢీకొన్న సంఘటనలో చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన మల్లవరపు నరసింహమూర్తి(54)కి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై ఎస్ఐ పి.శోభన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సకాలంలో మిల్లులకు చేరాలి

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

చాగల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల పొలాల్లో ధాన్యం సకాలంలో రైసుమిల్లులకు చేరే విధంగా సంబంధిత అధికారులు బాధ్యతగా పని చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. ఊనగట్ల సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్ము, వ్యవసాయాధికారి కె.వేణుగోపాలకృష్ణ, సివిల్ సప్లై డీటీ కె.సునీత, ఆర్ఐ షేక్ కమాల్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఏవో

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

కొవ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులను ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వరి కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలన్నారు. రోడ్లపై ధాన్యాన్ని సురక్షితంగా మిల్లులకు తరలించాలన్నారు. కోతలు పూర్తయిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.



ధర్మవరంలో రైతుకు సూచనలు చేస్తున్న ఆర్డీవో సుస్మిత

అప్రమత్తంగా ఉండాలి

నల్లజర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు పంటలు కోయవద్దని, కోసిన పంటను భద్రపర్చుకోవాలని తహశీల్దార్ కృష్ణారావు, వ్యవసాయాధికారి కమల్‌రాజ్ సూచించారు. వారు గురువారం అనంతపల్లిలో రైతులతో మాట్లాడారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం చాగల్లులో ఉన్న డ్రైయర్ ప్రాంతానికి తరలిస్తే ఆరిపోతాయని, గిడ్డంగులు ఉన్న వారు ధాన్యం భద్రపర్చుకోవాలన్నారు. ప్రతి రైతు అప్రమత్తంగా ఉండాలని ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసిపోకుండా కాపాడుకోవాలన్నారు. నల్లజర్ల, అనంతపల్లి, అచ్చన్నపాలెం, పోతవరం గ్రామాల్లో రైతులు పంటలు భద్రపర్చుకోవాలని హెచ్చరించారు.

దివ్యాంగులను ఆదరించాలి : మద్దిపాటి



గొల్లగూడెంలో దివ్యాంగుల కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను, నిరాదరణకు గురైన వారిని ఆదరించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గొల్లగూడెంలో భారతి దివ్యాం గుల వృద్ధాశ్రంలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో డీఈ ఎఫ్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నిరాదరణకు గురైన ఎందరో దివ్యాంగు లు, వృద్ధులకు బాసటగా నిలిచి ఆశ్రమంలో సేవలందిస్తున్న కాగిత భాస్కరరావును ఎమ్మెల్యే అభినందించారు. ఆశ్రమ రహదారికి సీసీ రోడ్డు ను మంజూరు చేశారు. కాగా ఆశ్రమానికి వచ్చే సత్య సాయి వాటర్ రెండేళ్లుగా రావడంలేదని దాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను భాస్కర రావు కోరారు. దివ్యాంగులకు కృత్రిమ అవయ వాన్ని ఎమ్మెల్యే అమర్చారు. అలాగే వాహనచో దకులు డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను వినియోగించి వాయు కాలుష్యాన్ని నియంత్రిం చాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమాల్లో జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, బందపురం సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, రొంగల సత్య నారాయణ, సుంకర దుర్గారావు, జ్యేష్ఠ శ్రీధర్, వృద్ధాశ్రమ డైరెక్టర్ కాగిత రత్నకిషోర్, డీఏఎఫ్ కేంద్రం నిర్వాహకులు యలమాటి సుధీర్‌బాబు, బెల్లంకొండ శ్రీనివాస్, నవీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

నల్లజర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కులను గురువారం ఎమ్మెల్యే మద్దిపాటి పలువురి బాధితులకు అందజేశారు. దూబచర్లకు చెందిన కొవ్వూరి జ్యోతికి రూ.1,17,992, నల్లజర్లకు చెందిన గన్నిన కృష్ణమూర్తికి రూ.1.04లక్షలు, కొమ్మిశెట్టి వెంకట బాలయోగికి రూ.1,15,299 చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కరావు,షేక్ మీరా, ఈడే శ్రీను, వల్లూరి సత్తిపండు, ఆలపాటి రామకృష్ణ, విడియాల శ్రీను, ,గుదే సుబ్బారావు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన రామన్నపాలెం విద్యార్థులు

దేవరపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సరస్వతి తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో నంద్యాల జిల్లా నందికొట్కూర్‌లో రాష్ట్రస్థాయి బాలుర, బాలికల సెపక్‌తక్రా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలురు ప్రథమ స్థానం, బాలికలు ద్వితీయ స్థానం సాధించారన్నారు. సెపక్‌తక్రా పోటీల్లో జాతీయ స్థాయికి విద్యార్థులు వై.ఆంథోని, ఎం.అఖిల్, ఎం.లాస్య, ఎం.తేజశ్రీ, కె.సుభాషిణి ఎంపికైనట్టు తెలిపారు.

డ్వాక్రా పుస్తకాల తనిఖీ పారదర్శకంగా జరగాలి

» డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి » డివిజన్‌లోని యూఎన్‌బీ సీఆర్పీలకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

రాజానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన పుస్తకాల తనిఖీలను పారదర్శకంగా నిర్వ హించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి చెప్పారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి (2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు) పుస్తకాల నిర్వహణ, తనిఖీలపై రాజానగరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు సంబంధించిన 74 మంది యూఎన్‌బీ సీఆర్పీ లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్థిక పురోభి వృద్ధి సాధించే దిశగా కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, ఎటువంటి అవినీతి, అక్ర మాలకు తావులేకుండా ఉండేలా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునే దిశగా మహిళలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డీపీఎం (ఫైనాన్స్) సంపత్‌కుమార్, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, లీగల్ కోఆర్డినేటర్లు, స్వర్ణలత, తిలక్, సింహాచలం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, కడియం, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ మండలాలకు చెందిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల దారిలో

నేడు ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల మైదానంలో శివ పార్వతుల కల్యాణం కార్యక్రమం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ వరకూ ఎలాంటి వాహనాలకూ అనుమతి ఉండదన్నారు. విశాఖ వెళ్లే బస్సులు ఇతర వాహనాలు, కంబాల చెరువు నుంచి లాలాచెరువు వెళ్లేవి క్వారీ మార్కెట్ సెంటర్, లాలాచెరువు గుండా వెళ్లాలి. కార్యక్రమానికి వెళ్లే వారు తమ వాహనాలను జడ్డి బంగ్లా దారిలో వెళ్లి ఆర్ట్స్ కళాశాల వెనుక వైపున పార్కింగ్ చేసుకోవాలన్నారు. కాలినడకన వచ్చే వారు మెయిన్‌గేటు, రెండోగేటు గుండా లోనికి ప్రవేశించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు

54 మంది ఓటర్లు

గోపాలపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5వ తేదీన జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు మండలంలో 54 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన అజయ్‌బాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 74వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికకు సెక్టార్ సూపర్‌వైజర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి, రూట్ ఆఫీసర్‌గా సీనియర్ అసిస్టెంట్ కేఎన్ రాజు నియమితులైనట్టు పేర్కొన్నారు. సారా విక్రయిస్తున్న 8మందిని బైం డోవర్ చేసి తహశీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు.

బెల్లపుఊట ధ్వంసం

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డ్రోన్ సహాయంతో పరిశీలించి సారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. గోంగూర లంక, వెంకటనగరం, పిచ్చుక లంక, బొబ్బిల్లంకల్లో 1800 లీటర్ల బెల్లపుఊట, 150 కిలోల నల్లబెల్లం, దేవరపల్లి స్టేషను పరిధిలో 1200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.